నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 31 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

నిధులు కేటాయించకపోవడం సరికాదు

రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, జూలై 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం జరిగిందని, రాష్ట్ర అభివృద్ధికి బడ్జెట్ కేటాయించకుండా ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కారని భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్టీ పార్లమెంటరీ నేత వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో ధ్వజమెత్తారు. మంగళవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన జాతీయ బడ్జెట్‌పై చర్చలో పాల్గొంటూ రాష్ట్ర ప్రజల న్యాయమైన హక్కులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి మరోసారి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో గొప్పగా అభివృద్ధి చేశారన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం సరైంది కాదన్నారు. తెలంగాణ ప్రజల న్యాయమైన డిమాండ్ల పట్ల స్పందించి నిధులు కేటాయించాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. పాలమూరు -రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించాలన్నారు. ఐఐఎం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ) నెలకొల్పాలన్నారు. కొత్తగా ఏర్పడిన 23 జిల్లాలకు నవోదయ పాఠశాలలు మంజూరు చేయాలని, ఐటీఐఆర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపి యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పి రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ

- సమస్యలున్న రైతులు వెంటనే అధికారులను సంప్రదించాలి
- రెండో విడత రుణమాఫీ ప్రారంభ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్

రుణాల వార్షిక ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

మామిళ్లగూడెం, జూలై 30: జిల్లాలో అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ పథకం అమలయ్యేలా చర్యలు తీసుకుంటన్నామని ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. రెండో విడత రైతు రుణమాఫీని హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభించగా ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని రైతులు, అధికారులు వీక్షించారు. అనంతరం జిల్లా రైతులు, అధికారులతో ఖమ్మం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రూ.లక్షన్నర వరకు పంట రుణాలు ఉన్న రైతులకు రెండో విడత కింద రుణమాఫీ జరిగినట్లు చెప్పారు. రెండు విడతల్లో కలిపి జిల్లాలో మొత్తం 91,973 మంది రైతుల రుణాలు మాఫీ అయినట్లు చెప్పారు. మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలున్న 57,857 మంది రైతుల్లో దాదాపు 51 వేలకు పైగా రైతుల ఖాతాలకు రూ.258 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. రెండో విడతలో రూ.లక్షన్నర వరకూ రుణాలున్న 34,116 మంది రైతులకు రుణమాఫీ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. వీటిని వచ్చే వారం రోజుల్లోపు రైతుల రుణ ఖాతాల్లో పూర్తి స్థాయిలో జమచేస్తామన్నారు. ఆ తరువాత రైతుల రుణాలు రెన్యూవల్ చేసి రుణమాఫీ ఫలాలు రైతులకు అందేలా బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రుణమాఫీపై సమస్యలున్న రైతులు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఇందుకోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అనంతరం, జిల్లా వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు విజయనిర్మల, మురళీధర్‌రావు, శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డీఎల్సీ ఆమోదంతోనే హక్కు పత్రాలు

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

గిరిజన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పర్ణశాల, జూలై 30 : డీఎల్సీ సమావేశంలో ఆమోదించిన తర్వాతే గిరిజన రైతులు పోడు వ్యవసాయం చేసుకోవడానికి హక్కు పత్రాలు అందించామని, ఎంత భూమి ఉందో అంత వరకే సాగు చేసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. మంగళవారం గౌరారం అటవీ రేంజ్ పరిధిలోని పైడిపల్లిలో తమను వ్యవసాయం చేసుకోకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని 23 మంది గిరిజన రైతులు హైకోర్టులో పిటిషన్ వేయగా.. కోర్టు ఆదేశాల మేరకు ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. ముందుగా అటవీ అధికారులు, గిరిజన రైతుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభలో తీర్మానించి డీఎల్సీ సమావేశంలో ఆమోదించిన ప్రకారం సర్వే నంబర్‌తో సహా పట్టా పాస్ పుస్తకంలో భూములు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే అటవీ అధికారులతో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని గిరిజన రైతులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్‌రావు, ఎఫ్ఆర్వో కనకమ్మ, దుమ్ముగూడెం తహసీల్దార్ మణిధర్, రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీ కొందరికేనా?

- రెండో విడతలోనూ రైతులకు మొండి'చేయి'
- అర్హత ఉన్నా కొర్రీలతో మాఫీకాని రుణం
- భద్రాద్రి జిల్లాలో 16,337 మందికి రూ.137 కోట్లు విడుదల

రైతు రుణమాఫీ సమావేశంలో కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న రైతులు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (నమస్తే తెలంగాణ) : రెండోవిడత రుణమాఫీలో సైతం కాంగ్రెస్ సర్కారు రైతులకు మొండిచేయి చూపించింది. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రెండోవిడత ప్రక్రియను ప్రారంభించగా జిల్లాలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ప్రారంభించారు. జిల్లాలోని అన్ని రైతువేదికల వద్ద వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. రుణమాఫీ అయిన కొంతమందిని మాత్రమే రైతువేదికల వద్దకు పిలిచి మాఫీ అయినట్లు వారితో మాట్లాడించారు. మాఫీకాని రైతులకు మాత్రం సమాచారం ఇవ్వలేకపోయారు. జిల్లావ్యాప్తంగా రూ.1.50 లక్షల లోపు రుణాలు తీసుకున్న 16,377 మంది రైతులకు రెండోవిడతలో భాగంగా రూ.137 కోట్ల నిధులు విడుదలైనట్లు అధికారులు ప్రకటించారు.

కొద్దిమందికే రుణమాఫీ..

తొలివిడతతో వేలమంది అర్హులు ఉండగా కేవలం 28,018 మందికే రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీంతో లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మొదటివిడతలో జిల్లా సహకార సంఘాల పరిధిలో 42,849 మంది రైతులు అర్హులు ఉండగా కేవలం 10,674 మందికి రుణమాఫీ చేశారు. ఇది కేవలం సొసైటీల లెక్కమాత్రమే. బ్యాంకుల పరిధిలో ఇంకా ఎక్కువ మంది రుణాలు మాఫీకాని రైతులు ఉన్నారు. రెండోవిడతలో 3,991 మంది అర్హులు ఉండగా ఇంకా జాబితా రాలేదని సొసైటీలకు లెక్కను ఇవ్వకపోవడం విశేషం. జిల్లావ్యాప్తంగా కేవలం సొసైటీల పరిధిలో 49,099 మంది అర్హులు ఉండగా మొదటివిడత 10,674 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా అన్ని బ్యాంకుల్లో రైతులకు కలిపి 44,395 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. అంటే ఈ లెక్కన ఇతర బ్యాంకుల్లో లెక్కలు తీస్తే ఎంతమంది రైతులు ఉంటారో వేరే చెప్పనక్కర్లేదు.

కలెక్టర్‌కు చింతల్‌తండా రైతుల ఫిర్యాదు

రుణమాఫీ లెక్కలు ఇలా ఉంటే పోడు రైతుల సమస్య విచిత్రంగా ఉంది. జూలూరుపాడు మండలం చింతల్‌తండాకు చెందిన 35మంది రైతులకు రుణమాఫీ అయినా రుణాలు మళ్లీ ఇవ్వడంలేదని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఇలాంటి సమస్యలతో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదే గ్రామానికి చెందిన రైతు గుగులోత్ ఈర్యా జీవించి ఉండగానే చనిపోయినట్లు చూపి రైతు భరోసాతోపాటు ఇతర పథకాలు లేకుండా చేశారు. దీంతో ఆ రైతు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

మళ్లీ రుణం ఇవ్వనంటున్నారు..

మాది పోడు పట్టా. రుణమాఫీ అయ్యింది. రైతుబంధు కూడా వస్తున్నది. బ్యాంకు అధికారులు మాత్రం మళ్లీ రుణం ఇవ్వమని చెప్తున్నారు. మా ఊర్లో 35 మంది రైతుల పరిస్థితి ఇలానే ఉంది. కొంతమందికి రుణమాఫీ రాకుండా ఇబ్బంది పడుతుంటే మా పరిస్థితి ఇలా ఉంది. అధికారులు మమ్మల్ని పట్టించుకోవాలి.

– భూక్యా రాములు, చింతల్‌తండా, జూలూరుపాడు మండలం

పట్టానే రాలేదు..

నాకు నాలుగెకరాల పొలం ఉంది. రైతుబంధు ఇస్తున్నారు. కాని పట్టా రాలేదు. చాలాసార్లు అధికారుల్ని అడిగినా పట్టించుకోవడం లేదు. నాకు పట్టా ఇప్పించండి. రుణమాఫీ ఎట్లా వస్తది. అప్పులు తెచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాను. మా ఊర్లో కొంతమంది రైతులకు ఇదే పరిస్థితి ఉంది. అందుకే కలెక్టర్ సార్‌ను కలిసాము.

– బానోత్ నాగు, చింతల్‌తండా, జూలూరుపాడు మండలం

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా రైతు శైలజ

సీఎం చేతుల మీదుగా రుణమాఫీ చెక్కు

– హైదరాబాద్‌లో అందుకున్న మహిళా రైతు

రఘునాథపాలెం, జూలై 30 : రైతు రుణమాఫీ రెండోవిడత ప్రక్రియలో భాగంగా రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామానికి చెందిన మహిళా రైతు బాదావత్ శైలజ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కు అందుకున్నారు.. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రుణమాఫీకి లబ్ధిదారురాలిగా ఉన్న శైలజకు సీఎం స్వయంగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండోవిడత రుణమాఫీ నిధులు విడుదల

- జిల్లా వ్యాప్తంగా 33,942 మందికి లబ్ధి
- రెండు విడతలు కలిపి 91,799 మందికి ప్రయోజనం
- రూ.520.76 కోట్ల నిధులు విడుదల

ఖమ్మం వ్యవసాయం, జూలై 30 : పంట రుణాల తీసుకున్న రైతులకు రెండో విడత రుణమాఫీ నిధులు మంగళవారం విడుదలయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నిధులను విడుదల చేయగా, జిల్లాలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నిధుల విడుదలను ప్రారంభించారు. మొత్తం మూడు విడతలుగా రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. అందులో భాగంగానే ఈ నెల 15వ తేదీన తొలివిడతగా రూ.లక్షలోపు రుణాలకు సంబంధించి 57,857 మంది రైతులకు రూ.258,25,75,452 విడుదల చేసింది. వాటికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతున్నది. రెండోవిడతలో భాగంగా రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల రుణాలు తీసుకున్న 33,942 మందికి రూ.262,50,56,893 కోట్ల రుణమాఫీ జరిగినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో రెండు విడతలు కలిపి ఖమ్మం జిల్లావ్యాప్తంగా 91,799 మంది రైతులకు రూ.520,76,32,345 రుణమాఫీ జరిగింది. రెండోవిడత రుణమాఫీ నిధుల విడుదల ప్రక్రియను రైతులు వీక్షించేందుకు జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 21 రైతువేదికల్లో ప్రత్యేక ప్రాజెక్టర్ ఏర్పాటు చేసిన వ్యవసాయశాఖ రైతులతో కలిసి సంబురాలు చేసుకున్నారు. రూ.1.50 లక్షలకు పైగా పంట రుణాలు తీసుకున్న రైతులకు మరికొద్ది రోజుల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేస్తున్న కలెక్టర్

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేశ్ పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. రైతు రుణమాఫీ రెండోవిడత నిధులను సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన రైతువేదికలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండోవిడతలో జిల్లాలోని రూ.1,50,000 లోపు రుణాలు ఉన్న రైతులందరికీ మాఫీ చేయనున్నట్లు తెలిపారు. 16,377 మంది లబ్ధిదారులకు రూ.137 కోట్ల 21 లక్షల 96 వేల 477వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. అనంతరం రెండో విడత రుణమాఫీ పొందిన రైతులకు కలెక్టర్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఏవో బాబూరావు, జిల్లా ఉద్యాన అధికారి సూర్యనారాయణ, జిల్లా సహకార అధికారి ఖుర్షీద్, కేవీకే శాస్త్రవేత్త లక్ష్మీనారాయణమ్మ, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంరెడ్డి, అన్నిబ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

డైవర్లు దేవుళ్లతో సమానం

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్
- ఆర్టీసీలో ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

మాట్లాడుతున్న సీపీ సునీల్ దత్

ప్రమాదరహితంగా బస్సులను నడిపి అవార్డులు అందుకున్న డ్రైవర్లతో అధికారులు

మామిళ్లగూడెం, జూలై 30 : డ్రైవర్లు దేవుళ్లతో సమానమని, వారు అప్రమత్తత, క్రమశిక్షణతో వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 30 వరకు ప్రమాద రహిత వారోత్సవాలను జిల్లా పరిధిలోని ఏడు డిపోలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాద రహిత డ్రైవింగ్ చేసిన డ్రైవర్లను ఖమ్మంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రమాదాల్లో అతి తక్కువ శాతం తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీలో మాత్రమే ఉన్నాయని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని కోరారు. ఇలాంటి వారోత్సవాలు పోలీస్ శాఖలోనూ నిర్వహిస్తామని తెలిపారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం మాట్లాడుతూ ప్రమాదాలు, బస్సులు తదితర ఆస్తులకు నష్టం కలగకుండా ఉండేందుకు ఉద్యోగులకు తగిన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా ముగింపు కార్యక్రమం రీజినల్ పరిధిలో చేపట్టామన్నారు. రీజియన్ స్థాయిలో ముగ్గురు ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించామని, వారిలో సత్తుపల్లి డిపో నుంచి ఎన్‌వీఎస్ రావుకు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో ఖమ్మం డిపో నుంచి డి.ఆంథోని, తృతీయ స్థానంలో ఖమ్మం డిపో నుంచి బి.రాములు ఉండగా.. వారిని సీపీ సన్మానించారు. డిపో స్థాయిలో ప్రతి డిపో నుంచి ముగ్గురు చొప్పున ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించి.. మొత్తంగా 21 మంది డ్రైవర్లను పోలీస్ కమిషనర్, ఇన్‌చార్జి ఆర్టీవో వెంకటరమణ సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) జీఎన్.పవిత్ర, డిపో మేనేజర్లు, అకౌంట్స్ ఆఫీసర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ల కోసం పాఠశాల ఎదుట ఆందోళన

పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీ ప్రాథమిక పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కొత్తగూడెం టౌన్, జూలై 30 : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. హనుమాన్ బస్తీ ప్రాథమిక పాఠశాలలో 189 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి పాఠాలు బోధించడానికి ముగ్గురు ఉపాధ్యాయులే ఉండడం.. ఇందులో ఒకరు సెలవుపై వెళ్లారు. దీంతో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు లేకపోవడంతో చదువులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. తమ పాఠశాలకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించాలని కోరారు.

ఉద్యమకారులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

ఖమ్మంలో తెలంగాణ ఉద్యమకారుల భారీ ర్యాలీ, నిరసన

ఖమ్మంలో ఆందోళన చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

మామిళ్లగూడెం, జూలై 30: తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన ఉద్యమకారులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖమ్మంలో మంగళవారం భారీ రాలీ నిర్వహించారు. తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేపట్టారు. ఈ సందర్భంగా ఫోరం బాధ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులను ఆదుకుంటామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 8 నెలలైనా ఇంకా ఆ హామీల ఊసు ఎత్తడంలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఖాళీ స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షల సాయం అందించాలని, నామినేటెడ్ పోస్టుల్లో ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ఇంకా ఇతర హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఫోరం బాధ్యులు డాక్టర్ కేవీ కృష్ణారావు, బొమ్మెర రామ్మూర్తి, దోకుపర్తి సుబ్బారావు, బత్తిన మధుగౌడ్, రవిచంద్ర, పగడాల నరేందర్ పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

8 నెలల కాంగ్రెస్ పాలనలో కంపుకొడుతున్న గ్రామాలు

1న పల్లెల్లో ధర్నాలు: బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా

మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

సారపాక, జూలై 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ ఎనిమిది నెలల కాలంలో జిల్లాలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. ప్రజాపాలన పేరుతో గ్రామాల పాలన గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. జిల్లాలో పారిశుధ్యం పడకేయడం, జ్వరాలు విజృంభిస్తుండడం వంటి కారణాల నేపథ్యంలో మంగళవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. పల్లెలు, పట్టణాల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయిందని, వర్షాకాలం సీజన్‌లో ప్రభుత్వం కనీసంగానైనా బ్లీచింగ్ చల్లించడం లేదని విమర్శించారు. కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజలు డయేరియా సహా ఇతర వ్యాధుల భారిన పడుతున్నారని అన్నారు. సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలుతున్నాయని అన్నారు. కాగా, ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆగస్టు 1న జిల్లాలోని అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ధర్నాలు నిర్వహించాలని, అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని బీఆర్ఎస్ శ్రేణులకు రేగా పిలుపునిచ్చారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని, బురదతో కలుషితమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాలని, వీధులను శుభ్రం చేయించాలని, వీధి దీపాలను అమర్చాలని, పల్లెల పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా మండల, పట్టణ, గ్రామ కమిటీలు వేయనున్నట్లు చెప్పారు.

అభ్యసన ఫలితాలను గుర్తించగలగాలి

న్యాస్ శిక్షణలో డీఈవో సోమశేఖర శర్మ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 30 : విద్యార్థులు చెప్పే బోధనాంశంలోని అభ్యసన ఫలితాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గుర్తించగలగాలని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. మంగళవారం నగరంలోని డైట్ కళాశాలలో న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) శిక్షణ కార్యక్రమంలో డీఈవో పాల్గొని ప్రసంగించారు. తరగతి గదిలో అభ్యసన ఫలితాలు పిల్లలకు వస్తున్నాయో.. లేదో తెలుసుకొని ఎప్పటికప్పుడు మదింపు ప్రక్రియ జరగాలని సూచించారు. ఆగస్టు మొదటి వారంలో ఉన్నత పాఠశాలల స్థాయిలో 10 స్కూల్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేసి మండల స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ప్రైమరీ తెలుగు 42, ఇంగ్లిష్ 42 మంది, హైస్కూల్ నుంచి తెలుగు, ఇంగ్లిష్, గణితం, సబ్జెక్ట్‌లలో 20 మంది చొప్పున, జిల్లా రిసోర్స్ పర్సన్‌లు 11 మంది హాజరయ్యారు. బుధవారం మిగిలిన సబ్జెక్ట్‌లకు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ, కోర్సు కోఆర్డినేటర్, ఏఎంవో కేశవపట్నం రవికుమార్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ప్రభాకర్‌రెడ్డి, వైజీకే మూర్తి, హరికిరణ్, 140 మంది మండల రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.